సాక్షి
జనగామ
శనివారం । 29 । జూలై । 2023



పలు ఎక్స్‌ప్రెస్‌రైళ్ల రీషెడ్యూల్

కాజీపేట జంక్షన్ మీదుగా ప్రయాణించే తెలంగాణ, పాట్నా ఎక్స్‌ప్రెస్ రైళ్లను రీషెడ్యూల్ చేసి నడిపిస్తున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. - 8లో▶



5 వరకు లా పరీక్షల ఫీజు గడువు

ఆగస్టు 5వ తేదీ వరకు ఎలాంటి అపరాధ రుసుం లేకుండా లా కోర్సు పరీక్షల ఫీజు చెల్లించవచ్చని కేయూ పరీక్షల నియంత్రణాధికారి మల్లారెడ్డి తెలిపారు. - 8లో▶

వాతావరణం

గరిష్టం/కనిష్టం
30°/24°

జిల్లాలో ఉదయం నుంచి ఆకాశం పూర్తి మేఘావృతమై ఉంటుంది. అక్కడక్కడా జల్లులు కురిసే అవకాశం ఉంది. మధ్యాహ్నం సమయంలో ఉష్ణోగ్రతలు కాస్త పెరుగుతాయి.

వాన ఆగే.. నష్టం మిగిలె

తెగిపోయిన రహదారులు • కొట్టుకుపోయిన కల్వర్టులు

- చెరువులు, కుంటలకు గండ్లు
- వందల సంఖ్యలో దెబ్బతిన్న ఇళ్లు
- ముంపులోనే పంట పొలాలు
- రూ.5 కోట్లకుపైగా నష్టం
- కల్వర్టులపై పొంగి పొర్లుతున్న వరద
- రాకపోకలకు తప్పని ఇబ్బందులు
- కొనసాగుతున్న మరమ్మతులు

అల్పపీడన ప్రభావంతో రెండు రోజుల పాటు కురిసిన భారీ వర్షాలు జిల్లాలో అపార నష్టాన్ని మిగిల్చాయి. రోడ్లు తెగిపోయాయి. చెరువులకు గండ్లు పడ్డాయి. వందల సంఖ్యలో గృహాలు దెబ్బతిన్నాయి. చెరువులు, కుంటలు, రిజర్వాయర్లు పొంగి పొర్లుతుండడంతో పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోగా.. తాత్కాలిక మరమ్మతు పనులు కొనసాగుతున్నాయి. శుక్రవారం వర్షం కాస్త తెరిపి ఇవ్వడంతో జిల్లాకు పెను ప్రమాదం తప్పింది. వరద ఉధృతి కొంతమేర తగ్గినప్పటికీ.. ఎగువ నుంచి కొనసాగుతూనే ఉంది. చాలా చోట్ల రాకపోకలకు అనుమతించడం లేదు. చీటకోడూరు, గండిరామవరం రిజర్వాయర్ల గేట్లు ఎత్తగా, స్టేషన్‌ఘన్‌పూర్, మైలారం రిజర్వాయర్లు మత్తడి పోస్తున్నాయి.

- జనగామ



రఘునాథపల్లి : మాదారం కల్వర్టు వద్ద కొట్టుకు పోయిన బీటీరోడ్డు

లింగాలఘణపురం: పటేల్‌గూడెం వాగు వద్ద కొనసాగుతున్న నీటి ప్రవాహం



తెగిన రోడ్లు.. చెరువులకు గండ్లు

జిల్లాలో 20 చోట్ల రోడ్లు తెగిపోయాయి. ఆరు చెరువులకు గండ్లు పడ్డాయి. 224 గృహాలు పాక్షికంగా దెబ్బతినగా, ఆరు ఇళ్లు పూర్తిగా కూలిపోయినట్లు అధికారులు నివేదికలో పేర్కొన్నారు. రెవెన్యూ, విద్యుత్, పీఆర్, ఆర్‌అండ్‌బీ, ప్రజలకు సంబంధించి రూ.5 కోట్లకు పైగా నష్టం సంభవించగా.. ఇందుకు సంబంధించి శాఖల వారీగా నివేదికలను తయారు చేసే పనిలో అధికార యంత్రాంగం నిమగ్నమైంది.



జఫర్‌గఢ్ : కూనూర్ నుంచి కోనాయిచలం మీదుగా జఫర్‌గఢ్‌కు వచ్చే రోడ్డుకు పడిన గండి

వర్షం నుంచి తేరుకోని జిల్లా

- జనగామ మండలం ఓబుల్‌కేశ్వాపూర్‌–చిన్న రామన్‌చర్ల, ఎర్రగొల్లపహాడ్‌–పెద్దపహాడ్ నుంచి వెళ్లే పెద్దతండా(వై), జనగామ నుంచి హుస్నాబాద్ మార్గంలోని గానుగుపాడు కల్వర్టు పనులు అసంపూర్తిగా ఉండడంతో వరదలకు రాకపోకలు కష్టంగా మారింది. ఈ దారుల నుంచి 35 గ్రామాల ప్రజలు రోజూ వెళ్లివస్తూ ఉంటారు. చీటకోడూరు వాగు కోతకు గురికావడంతో మూడు రోజులుగా రాకపోకలు స్తంభించి పోయాయి. ఎర్రకుంటతండా–పెద్దపహాడ్ మట్టిరోడ్డు ప్రమాదకరంగా మారింది.
- చిల్పూరు మండలంలో వరి పొలాలు కుంటలను తలపిస్తున్నాయి. పల్లగుట్ట, కొత్తపల్లి రోడ్డు, చిల్పూర్ గుట్ట, చిల్పూర్ గ్రామాల మధ్య రోడ్లు కోతకు గురయ్యాయి. గుట్ట మధ్యన వాగు ఉధృతి పెరగడంతో రాకపోకలు నిలిచాయి.
- బచ్చన్నపేట మండలం బసిరెడ్డిపల్లిలో రాగిపెల్లి లింగయ్య ఐదెకరాల పొలం నీట మునిగింది. ఇటుకాలపల్లి నుంచి బొందుగులకు వెళ్లే రోడ్డు రెండు వైపులా గండి పడడంతో రెండు రోజులుగా గ్రామాల మధ్య రాకపోకలు ఆగిపోయాయి. నక్కవానిగూడెం–పోచన్నపేట కల్వర్టులపై వరద ఉధృతి కొంత తగ్గడంతో ప్రయాణం మొదలైంది. మండల కేంద్రంలోని గుడిచెరువు కల్వర్టు, నిర్మాణంలో ఉన్న కట్టకు ప్రమాదం ఉంది.
- జఫర్‌గఢ్‌లో రికార్డు స్థాయి వర్షం కురవడంతో ఉప్పుగల్లు–కూనూరు, కూనూరు–గర్మిళ్లపల్లి, జఫర్‌గఢ్ శివారు వడ్డెగూడెం, సూరారం, కోణాయిచలం–కూనూరు, జఫర్‌గఢ్‌–తిమ్మంపేట పరిధిలో కల్వర్టులు, రోడ్లు కోతకు గురికావడంతో రాకపోకలు స్తంభించాయి. వరద తగ్గడంతో ఇప్పుడిప్పుడే దారులను ఓపెన్ చేస్తున్నారు. మండల కేంద్రంలోని పెద్దచెరువు బాలింతవాగు కాల్వ తెగి ఆయకట్టు పొలాలు నీటమునిగాయి.
- కొడకండ్ల–పాలకుర్తి మార్గంలో ఆర్టీసీ బస్సులు నేటికీ ప్రారంభంకాలేదు. ప్రైవేటు వాహనాలు అందుబాటులో ఉన్నాయి. కొడకండ్ల–నాంచారి మడూరు మార్గంలో పోచంపల్లి వద్ద రోడ్డు కొట్టుకుపోవడంతో రాకపోకలు నిలిపివేశారు.
- దేవరుప్పుల మండలం కడవెండిలో పెట్లోజు వీరాచారి పెంకుటిల్లు కూలిపోయింది.



నర్మెట: వెల్దండ చెరువును పరిశీలిస్తున్న డీసీపీ



చిల్పూరు: వరద ఉధృతిని పరిశీలిస్తున్న అధికారులు

- తరిగొప్పుల మండల కేంద్రం పెద్ద చెరువు పెద్ద మత్తడితో వరద రోడ్డుపై ప్రవహిస్తున్నది. సోలిపురం–పోతారం రోడ్డు కల్వర్టు తెగిపోవడంతో రాకపోకలు ఆగిపోయాయి.
- పాలకుర్తి మండల లక్ష్మీనారాయణపురం వాగు సమీప వరి పొలాలు వరదతో కొట్టుకుపోయాయి. పాలకుర్తి–కొడకండ్ల మార్గంలో ఆర్టీసీ బస్సులు నడవలేదు.
- రఘునాథపల్లి మండలం మాదారం వాగుపై బీటీ రోడ్డు కొట్టుకుపోవడంతో మండల కేంద్రానికి నేటికీ రాకపోకలు సాగడం లేదు. ఇబ్రహీంపూర్ మత్తడి వద్ద ఇదే పరిస్థితి నెలకొంది. మండలగూడెం మీదుగా జిల్లా కేంద్రం, మేకలగట్టు–నర్మెట వెళ్లే కల్వర్టులకు కోత పడడంతో ఇబ్బందులు తప్పడం లేదు. శ్రీమన్నారాయణపురం–బాంజీపేట, కోడూరు–రామన్నగూడెం రహదారిపై కల్వర్టు వద్ద రాకపోకలు పునరుద్ధరించలేదు.
- లింగాలఘణపురం మండలం పటేల్‌గూడెం కల్వర్టు వద్ద వరద ఉధృతి కొనసాగుతుండడంతో రాకపోకలకు అనుమతించడం లేదు.



పోతారం–ఉప్పరోనిగడ్డ రోడ్డు కల్వర్టు వద్ద..

కోతకు గురైన కల్వర్టులు

జిల్లాలో పంచాయతీరాజ్ శాఖ పరిధిలోని 25 కల్వర్టులు కోతకు గురయ్యాయ. ఆర్‌అండ్‌బీ పరిధిలోని 7, నేషనల్ హైవేపై ఒక చోట వరద ఉధృతి విపరీతంగా పెరగడంతో పగుళ్లు, ఇతర డ్యామేజీ ఏర్పడింది. ప్రస్తుతం తాత్కాలిక మరమ్మతు పనులు చేపట్టి రాకపోకలకు అంతరాయం లేకుండా చూస్తున్నారు. కుందారం కల్వర్టుకు శాశ్వత పరిష్కారం కోసం నూతన నిర్మాణానికి రాష్ట్ర మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు రూ.4.50 కోట్లు మంజూరు చేయించారు. మల్కాపూర్, కోతులబండ తండా, శ్రీపతిపల్లి – బొంతగట్టు నాగారం తదితర చోట్ల కొత్త కల్వర్టుల నిర్మాణానికి కలెక్టర్ శివలింగయ్య ఆదేశాల మేరకు ఆయా శాఖల అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు. గత ఏడాది నమిలిగొండ కల్వర్టు కోతకు గురై రాకపోకలు నిలిచిపోగా.. ఈసారి తెగిపోకుండా అవసరమైన చర్యలు తీసుకున్నారు. నూతన బ్రిడ్జి నిర్మాణంలో ఉంది.

- మరిన్ని ఫొటోలు 8లో▶

దృష్టంతా గ్రామాలపైనే..



భారీగా కురిసిన వర్షాల నేపథ్యంలో అధికార యంత్రాంగం గ్రామాలపైనే దృష్టి సారించింది. శుక్రవారం వర్షం శాంతించడంతో సహాయక చర్యలు ముమ్మరంగా సాగుతున్నాయి. కోతకు గురైన కల్వర్టులు, చెరువులకు సంబంధించి ఆయా శాఖలు నివేదికలు తయారు చేశాయి. గ్రామాల మధ్య రాకపోకల పునరుద్ధరణ పనులు వేగంగా సాగుతున్నాయి. అనేక చోట్ల ప్రయాణం మొదలైయింది. గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని నమిలిగొండ కట్ట తెగకుండా చర్యలు చేపట్టాం. ప్రస్తుతం కల్వ ర్టుల మధ్య తాత్కాలిక పనులు జరుగుతున్నా యి. శాశ్వత పరిష్కారం కోసం ప్రభుత్వానికి నివేదికలు పంపించాం.

- సీహెచ్.శివలింగయ్య, కలెక్టర్



లింగంపల్లివద్ద రోడ్డును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే



దేవరుప్పుల: కూలిన ఇల్లు వద్ద బాధితుడు

విద్యుత్ సంస్థకు రూ.10 లక్షల నష్టం

విద్యుత్ సంస్థకు సంబంధించి 33 కేవీ 10, 11కేవీ 12, ఎల్‌టీ లైన్‌లో 18 స్తంభాలు పడిపోయాయి. నాలుగు ట్రాన్స్‌ఫార్మర్లు కింద పడ్డాయి. చిల్పూరు 33/11కేవీ సబ్‌స్టేషన్ నీట మునిగింది. మొత్తం రూ.10లక్షల వరకు నష్టం వాటిల్లింది.

వర్షాలతో జరిగిన నష్టం మండలాల వారీగా..

మండలం	గృహాలు పూర్తి/పాక్షికం	పశువులు	కోతకు గురైన రోడ్లు, కల్వర్టులు, బ్రిడ్జిలు	చెరువులు
బచ్చన్నపేట	0/53	-	02	02
దేవరుప్పల	0/4	-	-	-
జనగామ	0/17	-	07	01
నర్మెట	0/28	01	01	-
రఘునాథపల్లి	1/15	01	05	-
లింగాలఘణపురం	0/16	-	-	-
తరిగొప్పల	0/23	-	01	01
స్టేషన్‌ఘన్‌పూర్	0/6	-	-	-
చిల్పూరు	2/17	01	-	-
జఫర్‌గఢ్	2/32	03	04	02
కొడకండ్ల	0/13	-	-	-
పాలకుర్తి	1/0	-	-	-
మొత్తం	6/224	06	20	06

రిజర్వాయర్లలో నీటి మట్టం(మీటర్లలో)

రిజర్వాయర్	సామర్థ్యం	ప్రస్తుతం
గండిరామవరం	422	422
బొమ్మకూరు	475	472.500
చీటకోడూరు	389	389
నవాబుపేట	328.800	328.600
స్టే.ఘన్‌పూర్	338.215	338.215
అశ్వరావుపల్లి	400	397.200
మైలారం	250.500	250.500



జనగామ రూరల్ : ప్రమాదకరంగా మారిన ఎర్రగుంట–పెద్దపహాడ్ మట్టిరోడ్డు కట్ట



పాలకుర్తి: లక్ష్మీనారాయణపురంలో వరి పొలాల్లో ఇసుక మేటలు



జఫర్‌గఢ్ : బాలంతవాగు వరదతో పెద్దచెరువు కట్టకు పడిన గండి

జలంలోనే 'జనగామ'

జనగామ పట్టణంలో వరద ఉధృతి నేటికీ కొనసాగుతోంది. కాలనీలన్నీ జలమయమయ్యాయి. డ్రెయినేజీలు సిల్ట్‌తో నిండి ఉండడంతో వరద నీరు రోడ్లపైకి చేరి అపరిశుభ్రంగా మారింది.

- వివరాలు 9లో▶



న్యూస్‌రీల్

బదిలీలు సహజం



జనగామ రూరల్: ఉద్యోగులకు బదిలీలు సహజమని, అంకితభావంతో పనిచేసి గుర్తింపు తెచ్చుకోవాలని కలెక్టర్ శివలింగయ్య అన్నారు. అదనపు కలెక్టర్ ప్రఫుల్‌దేశాయ్ బదిలీపై వెళ్తున్న సందర్భంగా శుక్రవారం కలెక్టరేట్‌లో ఆత్మీయ వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ మాట్లాడుతూ.. జిల్లాలో పనిచేయడం చాలా సంతోషంగా ఉందని, అందరి సహకారం ఎప్పటికీ మరిచిపోలేనని అన్నారు. అనంతరం ఆయనను సన్మానించారు. కార్యక్రమంలో డీపీఓ రంగాచారి, జెడ్పీ సీఈఓ వసంత, డీఆర్‌డీఓ రాంరెడ్డి, సివిల్ సప్లయ్ అధికారి రోజారాణి, టీఎన్‌జీఓ జిల్లా అధ్యక్షుడు, జేఏసీ చైర్మన్ ఖాజాషరీఫ్, కార్యదర్శి పెండెల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

తేరుకున్న ఆర్టీఓ కార్యాలయం



జనగామ: జనగామ మండలం హైదరాబాద్ ప్రధాన హైవే పక్కన పెంబర్తి కంబాలకుంటలో నిర్మించిన ఆర్టీఓ కార్యాలయం ఇటీవల వర్షానికి నీట మునిగిపోగా.. రెండు రోజులుగా సేవలు నిలిచి పోయాయి. ఇప్పుడిప్పుడే తేరుకుంటోంది. కార్యాలయంలోకి వెళ్లిన నీటిని శుక్రవారం సిబ్బంది ఎత్తిపోశారు. ఈనెల 31న సేవలు పునఃప్రారంభం కానున్నాయి.

వేగంగా విద్యుత్ పునరుద్ధరణ

జనగామ: జిల్లాలో ఇటీవల కురిసిన వర్షాలకు దెబ్బతిన్న విద్యుత్ పునరుద్ధరణ పనులను వేగంగా చేస్తున్నట్లు ఎన్పీడీసీఎల్ ఎస్‌ఈ వేణుమాధవ్ తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలో ఒకేరోజు 58 విద్యుత్ స్తంభాలు విరిగిపోగా, మూడు ట్రాన్స్‌ఫార్మర్లు కింద పడిపోయినట్లు తెలిపారు. 16 స్తంభాలు, రెండు ట్రాన్స్‌ఫార్మర్ల పునరుద్ధరణ పనులు పూర్తయ్యాయని చెప్పారు.

తండావాసులు ఏకమయ్యారు



చిల్పూరు: లింగంపల్లి జీపీ పరిధి దేవోజీ తండాకు రోడ్డు సక్రమంగా లేకపోవడతో బీటీ రోడ్డు వేయించాలని గ్రామానికి వచ్చిన అధికారులకు, ప్రజాప్రతినిధులకు మొరపెట్టుకున్నా పట్టించుకోలేదు. దీనికి తోడు ఇటీవల కురిసిన వర్షాలకు కాలినడక కూడా కష్టంగా మారింది. గురువారం తండాలో ఓ వ్యక్తి మృతి చెందగా కనీసం దహన సంస్కారాలకు మృతదేహాన్ని తీసుకువెళ్లడమూ కష్టంగా మారడంతో తండావాసులు ఒక్కటయ్యారు. అంతా కలిసి మట్టి రోడ్డు పోయించుకుని శుక్రవారం దహన సంస్కారాలు చేసినట్లు తండా పెద్దలు సంపత్, వేణు, శ్రీనివాస్, రమేష్, యాదగిరి, రాములు, రాజేందర్, లాలు తదితరులు తెలిపారు.

హోంమంత్రిని కలిసిన మాజీ సైనికులు



జనగామ: రాష్ట్ర హోం మంత్రి మహమూద్ అలీని మాజీ సైనికుల సమైక్య సంఘం బాధ్యులు శుక్రవారం హైదరాబాద్‌లో మర్యాద పూర్వకంగా కలిశారు. ప్రస్తుతం కురుస్తున్న వానల నేపథ్యంలో తమ సేవలను ఉపయోగించుకోవాలని, ఇందుకు సిద్ధంగా ఉన్నామని చెప్పారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు మాచర్ల భిక్షపతి, జనరల్ సెక్రటరీ కరుణాకర్‌రెడ్డి, ట్రెజరర్ వెంకటేశ్వర్లు, చైర్మన్ భూపతిరెడ్డి, వైస్ చైర్మన్ మార్కరెడ్డి పాల్గొన్నారు.

సీఎం దృష్టికి తీసుకెళ్లండి



జనగామ: కాంట్రాక్టు ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్లాలని జిల్లాలోని ఆయా శాఖల పరిధిలో పని చేస్తున్న కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు టీఎన్‌జీఓ అధ్యక్షుడు ఖాజాషరీఫ్, కార్యదర్శి పెండల శ్రీనివాస్‌ను కోరారు. ఈ మేరకు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు రాజేష్, జక్కుల కనకరాజు, సత్యపాల్, స్వప్న, ప్రేమ్‌కుమార్ టీఎన్‌జీఓ జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు రాజనర్సయ్య, ఉప్పలయ్య, మెడికల్ ఫోరమ్ అధ్యక్షుడు మానుపాటి నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

పర్యాటక కేంద్రాలుగా తీర్చిదిద్దుతా..

- ఎమ్మెల్సీ కడియం శ్రీహరి

స్టేషన్‌ఘన్‌పూర్: దేవాదుల ప్రాజెక్టు స్టేషన్‌ఘన్‌పూర్ రిజర్వాయర్‌తో పాటు నియోజకవర్గంలోని అన్ని రిజర్వాయర్లను పర్యాటక కేంద్రాలుగా తీర్చిదిద్దుతానని, ఈ మేరకు సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్తానని ఎమ్మెల్సీ కడియం శ్రీహరి అన్నారు. వరుసగా కురుస్తున్న భారీ వర్షాలతో ఘన్‌పూర్ రిజర్వాయర్ మత్తడి పడుతున్న విషయం తెలుసుకున్న ఆయన శుక్రవారం పార్టీ నాయకులతో కలిసి సందర్శించారు. పల్లగుట్ట క్రాస్‌రోడ్డు నుంచి రిజర్వాయర్ వరకు రెండు కిలోమీటర్ల దూరం చెప్పులు లేకుండానే కాలినడకన వెళ్లారు. గంగమ్మతల్లికి ప్రత్యేక పూజలు చేసిన అనంతరం బీఆర్‌ఎస్ నాయకుడు చింతకుంట్ల నరేందర్‌రెడ్డి నివాసంలో విలేకరులతో మాట్లాడారు. రిజర్వాయర్ కట్టపై ఉన్న తుమ్మచెట్లు మత్తడిని చూసేందుకు వచ్చే ప్రజలకు అసౌకర్యంగా ఉన్నాయని, నీటిపారుదల శాఖ అధికారులు నిర్లక్ష్యంగా పనిచేస్తున్నారని అసంతృప్తి వ్యక్తం చేశారు. తుమ్మ చెట్లను తొలగించడంతో పాటు ఛాగల్లు నుంచి రాజవరం వరకు చెరువుకట్టపై వాకర్లు నడిచేలా లింక్ ఏర్పాటు, కట్టకు దిగువన పూలచెట్లతో గ్రీనరీ ఏర్పాటు చేయాల్సి ఉందన్నారు. వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బెలిదె వెంకన్నగుప్తా, బూర్ల శంకర్, గట్టయ్య, మధుసూదన్‌రెడ్డి, రజాక్‌యాదవ్, సారంగపాణి, యాదగిరి, రాజేష్‌నాయక్, రాములు, పెసరు సారయ్య తదితరులు పాల్గొన్నారు.



విలేకర్లతో మాట్లాడుతున్న కడియం శ్రీహరి

మా దారి రహదారి..!

మా దారి రహదారి.. ఎవరు అడ్డువచ్చినా చించేస్తాం.. అన్నట్టుగా వానర సేనలు రోడ్డుకు అడ్డంగా నిలబడ్డాయి. ఈ దృశ్యం జనగామ–సిద్దిపేట రహదారి బచ్చన్నపేట సమీపాన శుక్రవారం 'సాక్షి' కంట పడింది. కోతుల గుంపును చూసి ప్రయాణికులు కాసేపు కలవరానికి గురయ్యారు.

- సాక్షి, స్టాఫ్ ఫొటోగ్రాఫర్, జనగామ



మణిపూర్ సీఎంను బర్తరఫ్ చేయాలి

- సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు

జనగామ రూరల్ : సాయుధ పోరాటానికి నిజమైన వారసులు కమ్యూనిస్టులే..మతతత్వ పార్టీ బీజేపీ తామే అని చెప్పుకోవడం సిగ్గుచేటు.. మణిపూర్ అల్లర్లకు బాధ్యత వహించి ముఖ్యమంత్రిని వెంటనే బర్తరఫ్ చేయాలని సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు డిమాండ్ చేశారు. ఏసీరెడ్డి నర్సింహారెడ్డి వర్ధంతి సందర్భంగా శుక్రవారం జిల్లా కేంద్రంలోని వైష్ణవి గార్డెన్‌లో ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడారు. నైజాంకు వ్యతిరేకంగా పీడిత ప్రజల కోసం జరిగిన తెలంగాణ సాయుధ పోరాట చరిత్ర సువర్ణ అక్షరాలతో రాయబడిందన్నారు. జనగామ గడ్డపై ముందుండి పోరాటాన్ని నడిపించిన ఉద్యమ సూర్యుడు నర్సింహారెడ్డి అని పేర్కొన్నారు. మతం పేరుతో రెచ్చగొట్టి పాలనసాగిస్తున్న బీజేపీ సర్కారు ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేస్తూ ఉన్న ఉద్యోగాలు తొలగించి నిరుద్యోగాన్ని పెంచుతోందని అన్నారు. రాష్ట్రంలో ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయడంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. ఎమ్మెల్యేలు భూకబ్జాకోరులుగా మారారని ధ్వజమెత్తారు. రాష్ట్రంలో డి ఫారాలలో ఎన్ని ఎకరాలు ఉన్నాయో శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ధనవంతుల భూకబ్జాలు లెక్కతీయాలని, జీపీ కార్మికులు, స్వీపర్లు, అంగవాడీలు, ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలు తక్షణమే పరిష్కరించాలన్నారు. అంతకు ముందు ప్రెస్టెన్ గ్రౌండ్ నుంచి ర్యాలీ నిర్వహించారు. పార్టీ జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ సభలో రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఎండీ.అబ్బాస్, నాయకులు రాపర్తి రాజు, జోగు ప్రకాష్, సాంబరాజు యాదగిరి, సుంచు విజేందర్, చందు, కొండల్‌రెడ్డి, భీమగోని చంద్రయ్య, మీట్యానాయక్, నరేందర్, బొట్ల శ్రీనివాస్, పొదల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



సభలో మాట్లాడుతున్న రాఘవులు

కేటీపీపీ పంపుహౌస్‌కు చేరిన వరద



కేటీపీపీ పంపుహౌస్ మోటార్ల సమీపానికి చేరిన వరద

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం మెట్‌పల్లి వద్ద గోదావరిని ఆనుకొని నిర్మించిన కేటీపీపీ పంపుహౌస్ వద్దకు వరద ఉధృతి చేరింది. శుక్రవారం రాత్రి మోటార్ల వద్దకు చేరుతున్నట్లు తెలిసింది. వరద పెరిగితే మోటార్లు, కంట్రోల్‌రూం ప్యానల్ బోర్డుల వద్దకు వచ్చే అవకాశం ఉందని తెలిసింది. గతేడాది జూలై 14న ఎలక్ట్రిక్ కంట్రోల్ రూం మునిగిన విషయం తెలిసిందే.

కేయూ బాటనీ విభాగం అధిపతిగా లక్ష్మారెడ్డి



కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలోని బాటనీ విభాగం అధిపతిగా ఆర్ట్స్‌అండ్ సైన్స్ కళాశాలలో బాటనీ విభాగంలో కాంట్రాక్టు లెక్చరర్‌గా పనిచేస్తున్న డాక్టర్ జి.లక్ష్మారెడ్డిని నియమించారు. శుక్రవారం కేయూ వీసీ రమేశ్ ఆదేశాల మేరకు రిజిస్ట్రార్ శ్రీనివాస్‌రావు ఉత్తర్వులు జారీ చేశారు. ఆచార్య మహ్మద్ ముస్తాఫా పదవీకాలం ముగియటంతో ఆయన స్థానంలో లక్ష్మారెడ్డిని నియమించారు. ఒక టి రెండు రోజుల్లో బాధ్యతలు స్వీకరించనున్నారు.

ఇద్దరు రెగ్యులర్ అధ్యాపకులు...

కాకతీయ యూనివర్సిటీలో బాటనీ విభాగంలో ఇద్దరు రెగ్యులర్ అధ్యాపకులుగా ప్రొఫెసర్ మహ్మద్ ముస్తాఫా, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ లలితకుమారి ఉన్నప్పటికీ హనుమకొండలోని ఆర్ట్స్‌అండ్ సైన్స్ కళాశాలలోని కాంట్రాక్టు లెక్చరర్ లక్ష్మారెడ్డిని క్యాంపస్‌లో బాటనీ విభాగం అధిపతిగా నియమించడం యూనివర్సిటీలో చర్చనీయాంశంగా మారింది. యూనివర్సిటీలో చరిత్రలో ఓ విభాగం అధిపతి కాంట్రాక్టు లెక్చరర్‌ను నియమించటం ఇది తొలిసారి. ఇప్పటికే క్యాంపస్‌లో విద్యాకళాశాలలో, ఫిజికల్ ఎడ్యుకేషన్‌లో రెగ్యులర్ అధ్యాపకులు లేకపోవటంతో ఆ కళాశాలకు ప్రిన్సిపాల్స్‌గా కాంట్రాక్టులెక్చరర్లకే అప్పగించారు.

మొగుళ్లపల్లి : ముల్కలపల్లి-కొర్కిశాల రోడ్డు



మొగుళ్లపల్లి : రంగాపూర్-ఇస్సిపేట రోడ్డు



గణపురం : నగరంపల్లి వద్ద తెగిన రోడ్డు



దంతాలపల్లి : గండిపడిన సీసీ రోడ్డు



రోడ్లు ధ్వంసం.. ఇసుక మేటలు

నాలుగు రోజులు కురిసిన భారీ వర్షాలతో వాగులు, వంకలు పొంగిపొర్లడడమే కాకుండా చెరువులు, కుంటలు మత్తళ్లు పడ్డాయి. కొన్ని చోట్ల గండిపడ్డాయి. శుక్రవారం కాస్త వర్షం తగ్గినా వరదలు మాత్రం ఆగడం లేదు. ప్రధాన రహదారులపై కొన్ని చోట్ల రాకపోకలు స్తంభించిపోయాయి. కాలనీలు, ముంపు ప్రాంతాల్లో వరద నీరు తగ్గకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. పంట చేలల్లోకి నీరు చేరడంతో పంటలు నీట మునగడమే కాకుండా పొలాల్లో ఇసుక మేటలు వేశాయి.

– సాక్షి నెట్‌వర్క్



మరిపెడ రూరల్ : పత్తిలో నిలిచిన వర్షపు నీరు



చిన్నగూడూరు : వరద ఉధృతికి చెల్లాచెదురుగా పడి ఉన్న కంపోస్ట్ యార్డ్, వైకుంఠధామాలు



నయీంనగర్ : నయీంనగర్ బ్రిడ్జి వద్ద ధ్వంసమైన రోడ్డు



కమలాపూర్ : శివాలయంలోకి ఉబికి వస్తున్న నీటిలో నంది విగ్రహాలు



పాలకుర్తి : లక్ష్మీనారాయణపురంలో వరిపొలాల్లో ఇసుక మేటలు



ములుగు : రోడ్డు వెంట ప్రవహిస్తున్న వరద



జవహర్ కాలనీలో వరద ముంపునకు గురైన మహ్మద్ ఖాదర్ పాషా గృహం



మల్లూర్ : వల్లెకుంట పొలాల్లో ఇసుక మేటలు



పరకాల: తెగిన పరకాల-భూపాలపల్లి రోడ్డు



వర్ధన్నపేట : కోనారెడ్డి చెరువు కట్ట



బచ్చన్నపేట : బొందుగల రోడ్డుపై తెగిన కల్వర్టు



మంగపేట : వరద కోతకు గురైన రోడ్డు

భారీ వర్షాలతో ఎన్పీడీసీఎల్‌కు రూ.20 కోట్ల నష్టం

- టీఎస్ ఎన్పీడీసీఎల్ చైర్మన్, ఎండీ అన్నమనేని గోపాల్‌రావు
- ముంపు ప్రాంతాల సబ్‌స్టేషన్ల పరిశీలన

హన్మకొండ: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు టీఎస్ ఎన్పీడీసీఎల్‌కు రూ.20 కోట్ల నష్టం జరిగిందని టీఎస్ ఎన్పీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ అన్నమనేని గోపాల్‌రావు తెలిపారు. శుక్రవారం హనుమకొండలోని వరద తీవ్రతతో ముంపునకు గురైన యాదవనగర్, గోపాల్‌పూర్ విద్యుత్ సబ్‌స్టేషన్లను సందర్శించారు. అదేవిధంగా కాకతీయ కాలనీలో తెగిపడిన లైనును పరిశీలించి కారణాలు అడిగి తెలుసుకున్నారు. భవిష్యత్‌లో పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం సీఎండీ మాట్లాడుతూ నీట మునిగిన సబ్‌స్టేషన్లతో విద్యుత్ అంతరాయం కలిగిన కాలనీలకు విద్యుత్ సరఫరా పునరుద్ధరించాలని ఆదేశించారు. హనుమకొండ, వరంగల్, ములుగు, భూపాలపల్లి జిల్లాలో అతి భారీవర్షాల వల్ల వేలాది స్తంభాలు, డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లు, వందలాది కిలోమీటర్ల లైన్లు దెబ్బతిన్నాయని వివరించారు.



యాదవనగర్ సబ్‌స్టేషన్‌ను పరిశీలించి అధికారులతో మాట్లాడుతున్న సీఎండీ గోపాల్‌రావు

ప్రతి జిల్లాకు ఇద్దరు చొప్పున స్పెషల్ ఆఫీసర్లను, కాంట్రాక్టు ఏజెన్సీలను నియమించి యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేపట్టాలని ఆదేశించారు. ఉద్యోగులు, సిబ్బంది రేయింబవళ్లు కష్టపడి విద్యుత్ సరఫరా అందించడానికి అహర్నిశలు కృషి చేస్తున్నారని తెలిపారు. చాలాచోట్ల విద్యుత్ సరఫరా అందించామని, మిగతా ప్రాంతాల్లో త్వరలో పునరుద్ధరణ పనులు జరుగుతుందన్నారు. కార్యక్రమంలో హనుమకొండ ఎస్‌ఈ వెంకటరమణ, డీఈ జి.సాంబరెడ్డి, ఏడీఈలు దర్శన్‌కుమార్, కిషన్, ఏఈలు, ఉద్యోగులు పాల్గొన్నారు.

ఆగస్టు 5 వరకు లా పరీక్షల ఫీజు గడువు

కేయూ క్యాంపస్ : కాకతీయ యూనివర్సిటీ పరిధిలో మూడేళ్ల లా కోర్సు రెండో, నాల్గో, ఆరవ సెమిస్టర్ పరీక్షలకు, ఐదేళ్ల లా కోర్సు రెండో, నాల్గవ, ఆరవ, 8వ, 10వ సెమిస్టర్ పరీక్షలకు (రెగ్యులర్, ఎక్స్, ఇంప్రూవ్‌మెంటు) విద్యార్థులు ఆగస్టు 5 వరకు ఎలాంటి అపరాధ రుసుము లేకుండా పరీక్షల ఫీజులు చెల్లించాలని కేయూ పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య పి.మల్లారెడ్డి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ రాధిక ఒక ప్రకటనలో కోరారు. రూ 250 అపరాధ రుసుముతో 8 వరకు గడువు ఉందన్నారు. రెగ్యులర్ విద్యార్థులకు ఫీజు రూ.1030, మూడేళ్ల ఆరవ సెమిస్టర్, ఐదేళ్ల 10వ సెమిస్టర్ రెగ్యులర్ విద్యార్థులకు రూ.1360, బ్యాక్ లాగ్స్ రెండు పేపర్లకు పైన ఫీజు రూ.930, రెండు పేపర్ల వరకు రూ.400, ఇంప్రూవ్‌మెంటు ప్రతి పేపర్‌కు రూ 300ల చొప్పున పరీక్ష ఫీజు చెల్లించాల్సింటుందని వారు పేర్కొన్నారు.

వరదలకు కొట్టుకొచ్చిన మృతదేహాలు లభ్యం



వరదనీటిలో శ్రీను మృతదేహం

రామన్నపేట : నగరంలోని రామన్నపేటలో రిక్షా తొక్కుతూ జీవనం సాగించే నరంశెట్టి శ్రీను (40) మృతదేహం వరదల తాకిడికి రామన్నపేట ఎస్సీ కాలనీలో లభ్యమైనట్లు స్థానికులు తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. గురువారం కురిసిన భారీవర్షం వరదలకు కాలనీ అంతా జలదిగ్బంధంలో చిక్కుకుంది. శుక్రవారం ఉదయం కాలనీ వాళ్లు నిద్రలేచేసరికి కాలనీలో నీటిలో శ్రీను మృతదేహం కనిపించిందని తెలిపారు. మృతుడి స్వగ్రామం నర్సంపేట మండలం గుండ్రాయిపల్లి గ్రామంగా గుర్తించారు. అత్తగారిల్లు కీర్తినగర్. మృతుడికి భార్య, ఇద్దరు కూతుళ్లు ఉన్నారని తెలిపారు. పోలీసులు పంచనామా నిర్వహించి కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

గోపాలపురంలో యువకుడు..

హసన్‌పర్తి: వరదల్లో గల్లంతైన టీఎన్జీవోస్ కాలనీ–2కు చెందిన గట్టు రాజు మృతదేహం గోపాలపురం చెరువులో శుక్రవారం లభ్యమైంది. సమాచారం అందుకున్న స్థానిక ఎస్సై విజయ్‌కుమార్ సంఘటన స్థలాన్ని చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. రాజు మృతదేహాన్ని బీజేపీ ఎన్నికల నిర్వహణ కమిటీ చైర్మన్ ఈటల రాజేందర్ సందర్శించి కుటుంబాన్ని ఓదార్చారు. ఆయన వెంట బీజేపీ, హనుమకొండ, వరంగల్ జిల్లాల అధ్యక్షులు రావు పద్మ, కొండేటి శ్రీధర్, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు తీగల భరత్, ఎఫ్‌సీఐ బోర్డు సభ్యుడు సురేందర్‌గౌడ్, అనిల్ ఉన్నారు. అలాగే గట్టు రాజు మృతదేహాన్ని ఎమ్మెల్యే అరూరి రమేష్ సందర్శించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. కుటుంబాన్ని అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఎమ్మెల్యే వెంట కార్పొరేటర్ సిరంగి సునీల్‌కుమార్, నాయకులు చింత రమేష్, పెద్ద రాజు, సయ్యద్ ఉమర్ పాషా, తదితరులు ఉన్నారు.

మడికొండ శివారులో..



వెంచర్‌లో లభించిన గుర్తుతెలియని మృతదేహం

మడికొండ: కాజీపేట మండలం మడికొండ శివారులోని ప్రైమ్ సిటీ వెంచర్‌లో శుక్రవారం గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. మడికొండ శివారులోని వెంచర్‌లో శుక్రవారం సుమారు (50) సంవత్సరాల వయస్సు ఉన్న గుర్తుతెలియని మృతదేహాన్ని వెంచర్ సూపర్‌వైజర్ తొట్టె తిరుపతి గురువారం వచ్చిన వరదలకు ప్రహరీ కూలిపోగా శుక్రవారం వెంచర్‌ను పర్యవేక్షిస్తుండగా మృతదేహం కనిపించడంతో పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం ఎంజీఎం ఆస్పత్రికి తరలించినట్లు ఇన్‌స్పెక్టర్ వేణు తెలిపారు. మృతదేహంపై ఎలాంటి ఆనవాళ్లు లేవన్నారు. ఎవరైనా ఆచూకీ తెలిస్తే మడికొండ ఇన్‌స్పెక్టర్ 87126 85123, సబ్ ఇన్‌స్పెక్టర్ 87126 85248 నంబర్లలో సమాచారం అందించాలని పేర్కొన్నారు.

తెలంగాణ, పాట్నా ఎక్స్‌ప్రెస్‌ల రీషెడ్యూల్

కాజీపేట రూరల్ : కాజీపేట జంక్షన్ మీదుగా ప్రయాణించే హైదరాబాద్-న్యూఢిల్లీ వెళ్లే తెలంగాణ సూపర్‌ఫాస్ట్, సికింద్రాబాద్-దానాపూర్ వెళ్లే పాట్నా ఎక్స్‌ప్రెస్‌ను శుక్రవారం రీ షెడ్యూల్ చేసి నడిపిస్తున్నట్లు అధికారులు తెలిపారు. గురువారం వర్షాల కారణంగా కాజీపేట వడ్డేపల్లి రైల్వేట్రాక్ వద్దకు వరదనీరు చేరడంతో పలు రైళ్లను అధికారులు రద్దు చేసి దారి మళ్లించారు. ఈ ఘటనతో తెలంగాణ, పాట్నా ఎక్స్‌ప్రెస్‌లను రీ షెడ్యూల్ చేసినట్లు తెలిపారు. అదేవిధంగా కోర్బా–యశ్వంత్‌పూర్ వెళ్లే ఎక్స్‌ప్రెస్, రక్సోల్–సికింద్రాబాద్ వెళ్లే ఎక్స్‌ప్రెస్‌ను వయా విజయనగరం, విజయవాడ మీదుగా దారి మళ్లించారు. కాజీపేట జంక్షన్‌లో ఏర్పాటు చేసిన హెల్ప్‌డెస్క్ నుంచి రైల్వే టీటీఈలు ప్రయాణికులను రైళ్లలో పంపేలా చేశారు.

ప్లాట్‌ఫాంలో నీరు తొలగింపు

కాజీపేట రైల్వేస్టేషన్‌లో 1వ నంబర్ ప్లాట్‌ఫాం నిండా గురువారం వర్షం నీరు చేరడంతో పలు రైళ్లకు అంతరాయం ఏర్పడింది. దీంతో శుక్రవారం రైల్వే అధికారులు ప్లాట్‌ఫాంలోకి చేరిన నీటిని బయటికి పంపించారు.

చెరువుగా రైల్వే స్టేడియం

కాజీపేట రైల్వే స్టేడియంలోకి వర్షం నీరు పెద్ద ఎత్తున చేరవడంతో చెరువును తలపించింది. ఇటీవల సుమారు రూ.35 లక్షలతో రైల్వే స్టేడియాన్ని అత్యాధునీకరించారు. కానీ వర్షం నీరు బయటికి వెళ్లేందుకు డ్రెయినేజీ సిస్టం లేకపోవడంతో వర్షం పడినప్పుడల్లా నీరు చేరుతుంది. ఎడతెరిపిలేకుండా కురుస్తున్న వర్షాల కారణంగాతో నీరు చేరడంతో స్టేడియం అంతా నిండి ఉంటుంది.

మిన్నంటిన రోదనలు



అజహర్ మృతదేహం



మజీద్‌ఖాన్ మృతదేహం



షరీఫ్ మృతదేహం



రషీద్ మృతదేహం




కరీమా మృతదేహం



లాల్‌బీ మృతదేహం



సమ్మక్క మృతదేహం



మహబూబ్‌ఖాన్ మృతదేహం



రోదిస్తున్న కుటుంబ సభ్యులు

ఏటూరునాగారం: ములుగు జిల్లా ఏటూరునాగారం మండలంలో కొండాయి నుంచి మల్యాలకు వెళ్తున్న క్రమంలో కల్వర్టు తెగి 15 మంది వరదలో కొట్టుకుపోయిన విషయం తెలిసిందే. ఇందులో 8 మంది మృతదేహాలు శుక్రవారం లభ్యమయ్యాయి. దీంతో బంధువుల రోదనలు మిన్నంటాయి. ఈ పాపమంతా కల్వర్టు నిర్మించిన కాంట్రాక్టర్‌దేనని మృతుల బంధువులు ఆరోపిస్తున్నారు. కాంట్రాక్టర్‌పై క్రిమినల్ కేసు పెట్టాలని పరామర్శకు వచ్చిన జెడ్పీ చైర్‌పర్సన్ నాగజ్యోతితో తల్లిదండ్రులను కోల్పోయిన రషీద్, కరీమా కుమారుడు రఫీక్ వాపోయారు. జంపన్నవాగు ఉధృతిగా ఉండడంతో జిల్లా ఎస్పీ గౌష్ ఆలం, ఓఎస్డీ అశోక్, ఎమ్మెల్యే సీతక్క, జెడ్పీ చైర్‌పర్సన్ నాగజ్యోతి, రెడ్కో చైర్మన్ సతీష్‌రెడ్డి, జెడ్పీ సీఈఓ ప్రసూనరాణిల చొరవతో పడవల ద్వారా ఎన్డీఆర్‌ఎఫ్ బృందాలతో మృతదేహాలను మార్చురీకి తరలించారు.

వడ్డేపల్లి రైల్వే ట్రాక్‌పై గస్తీ

కాజీపేట రూరల్ : కాజీపేట వడ్డేపల్లి రైల్వే ట్రాక్‌పై రైల్వే అధికారులు శుక్రవారం ట్రాక్ గస్తీని పెట్టారు. వర్షాలకు గురువారం వడ్డేపల్లి రైల్వేట్రాక్ వద్దకు వరద నీటి ఉధృతి పెరగడంతో ట్రాక్ కొట్టుకుపోయే ప్రమాదం ఉందని అధికారులు రైళ్లను ఈ ట్రాక్‌మీదుగా రద్దు చేసి రాత్రి 10 గంటల తర్వాత తక్కువ వేగంతో పునరుద్ధరించారు. శుక్రవారం ఇంజనీరింగ్, బ్రిడ్జి విభాగం రైల్వే అధికారులు సిబ్బందిని ట్రాక్‌వద్ద గస్తీ పెట్టారు. వర్షం పడి ట్రాక్‌కు వర్షం నీరు తాకడంతో గస్తీ చేసే వారి సమాచారంతో రైళ్లను ఈ ట్రాక్‌పై నుంచి రద్దు చేసేలా చర్యలు తీసుకున్నారు. వరద ఉధృతికి ట్రాక్ ఏమైనా దెబ్బతిని ఉండవచ్చని రైల్వే ఇంజనీరింగ్ అధికారులు మరమ్మతు చేసి రైళ్ల స్పీడ్ పెంచేలా చర్యలు తీసుకున్నారు.

బిక్కుబిక్కుమంటూ గడిపాం



మల్యాల, కొండాయి ఉధృతంగా ప్రవహిస్తున్న జంపన్నవాగు



నీటిలో మంచం మోసుకొస్తున్న బాధితుడు

- 24 గంటలు ప్రాణాలు అరచేతిలోనే
- నీట మునిగిన వందలాది ఇళ్లు

ఏటూరునాగారం : జంపన్నవాగు వరద, పెద్ద చెరువు పోటెత్తడం, జంపన్నవాగు వద్ద నిర్మించిన కరకట్ట తెగిపోవడంతో మండలంలోని కొండాయి, మల్యాల గ్రామాల్లోని ఇళ్లు నీట మునిగాయి. 24 గంటల పాటు వరద నీటిలోనే సుమారు 200 మంది ప్రజలు బిక్కుబిక్కుమంటూ ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని భవనాలు ఎక్కి తల దాచుకున్నారు. మల్యాల ఆశ్రమ పాఠశాలలోకి కూడా వరద రావడంతో భవనం పైనే ఉండిపోయారు. గురువారం ఉదయం నుంచి శుక్రవారం ఉదయం వరకు ఆ రెండు గ్రామాల్లో అనేక మంది ప్రజలు నానా అవస్థలు పడుతూ దేవుడిని వేడుకుంటూ బతికి బయటపడ్డారు. దళిత కాలనీలోని 40 ఇళ్లు నేలమట్టమయ్యాయి. అలాగే దొడ్లలో కూడా ఇళ్లు కూలిపోయాయి. ఇంకా మల్యాల, కొండాయి గ్రామాల్లో శుక్రవారం సైతం వరద నీరు ఉండడంతో ప్రజలు వణికిపోతున్నారు.

బతుకుతామని ఆశ లేదు



పుట్టిననాటి నుంచి ఇప్పటి వరకు ఇంత వరద చూడలేదు. బతుకుతామని అనుకోలేదు. దేవుడి దయతో బతికి బయటపడ్డాం. మా బంధువులు చనిపోయారు. వరదలు తట్టుకునే పరిస్థితి లేకుండా పోయింది.

– అంకూస్‌బీ, కొండాయి వరద బాధితురాలు

భవనంపైనే ఉన్నా



రాత్రి అంతా భవనంపైనే ఉన్నా. మా ఇళ్లు కొండాయిలో ఉంది. వరద వస్తుందని మల్యాల ఆశ్రమ పాఠశాల భవనం పైకి ఎక్కి కూర్చొని ఉన్నా. నా ప్రాణాలను కాపాడుకున్నా. కానీ మా బంధువులు చనిపోయారు. దేవుడు అన్యాయం చేశాడు. చాలా భయంతో గడిపాం.

– ఎండి సల్మాన్‌ఖాన్, కొండాయి